క్లుప్తంగా

సీఎంను కలిసిన ఎస్‌డీహెచ్‌ఆర్ విద్యాసంస్థల అధినేత



తిరుపతి సిటీ : కుప్పం పర్యటనలో భాగంగా సోమవారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎస్‌డీహెచ్‌ఆర్ విద్యాసంస్థల అధినేత డీవీఎస్ చక్రవర్తిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

మహిళా వర్సిటీ వీసీకి సీఎం అభినందనలు



సీఎంకు స్వాగతం పలుకుతున్న వీసీ డి.భారతి

పద్మావతీ మహిళా వర్సిటీ వీసీ డి.భారతి, రిజిస్ట్రార్ రజిని సోమవారం రేణిగుంట ఎయిర్‌పోర్టులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పద్మావతి మహిళా వర్సిటీకి కేంద్ర ప్రభుత్వం పీఎం ఉషా పథకం కింద రూ.100 కోట్లు మంజూరు చేసిన విషయాన్ని వీసీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వర్సిటీ అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఈ సందర్భంగా సీఎం వారిని ఆదేశిస్తూ అభినందనలు తెలిపారు.

సమాజ సేవకులకు పురస్కారాలు



ప్రముఖులను సన్మానిస్తున్న నవసమాజ ఫెడరేషన్ అధ్యక్షుడు నగేష్, అతిథులు

తిరుపతి సిటీ : నవ సమాజ ఫెడరేషన్ 13వ వార్షికోత్సవాన్ని వ్యవస్థాపక అధ్యక్షుడు నీరుగట్టు నగేష్ ఆధ్వర్యంలో ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య, సామాజిక సేవలో విశేష కృషి చేసిన సుమారు 13 మంది ప్రముఖులను సన్మానించారు. జ్యోతి ప్రకాష్, విశ్వం విద్యాసంస్థల అధినేత విశ్వనాథ్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, నిరంజన్‌బాబు, బీవీ మురళీధర్, పి రెడ్డెప్ప, జనార్దన్, ఎస్ ఖాజా, ఒ కిరణ్‌కుమార్, రామాంజనేయులు, కే సీమ తదితరులు ఉన్నారు. చదలవాడ సుచరిత, ఎస్పీడబ్ల్యూ ప్రిన్సిపాల్ నారాయణమ్మ, పీసీ రాయల్, మాజీ రిజిస్ట్రార్ మమత పాల్గొన్నారు.

హథీరాంజీ మఠం మహంత్‌గా ఓంప్రకాష్ దాస్



బాధ్యతలు చేపడుతున్న ఓంప్రకాష్‌దాస్

తిరుపతి కల్చరల్: తిరుపతిలోని హథీరాంజీ మఠం మహంత్‌గా తిరుమలలోని జపాలి హనుమాన్ ఆలయంలో పనిచేస్తున్న ఓంప్రకాష్ దాస్ సోమవారం హథీరాంజీ మఠం ఫిట్ పర్సన్ కె.రమేష్ నాయుడు నుంచి బాధ్యతలు తీసుకున్నారు. రమేష్ నాయుడు మాట్లాడుతూ హథీరాంజీ మఠం గత మహంత్ తొలగింపు అనంతరం హైకోర్టు 4 ఏళ్లలోపు మహంత్‌ను నియమించాలని తీర్పు ఇచ్చిందన్నారు. ఈ క్రమంలో ధార్మిక పరిషత్ మహంత్ నియామకానికి చర్యలు చేపట్టిందన్నారు. ఓంప్రకాష్‌దాస్‌ను హథీరాంజీ మఠం తాత్కాలిక మహంత్‌గా నియమించినట్టు పేర్కొన్నారు. మహంత్ ఓంప్రకాష్ మాట్లాడుతూ తనకు ఇచ్చిన బాధ్యతలను మఠం నిబంధనల మేరకు నెరవేరుస్తానని పేర్కొన్నారు.

చేసిన మేలును గుర్తించి ఆదరించండి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

- రాష్ట్రంలోనే ఆదర్శంగా తిరుపతి నగరం అభివృద్ధి
- 20 ఏళ్లలో ఎవరికీ సాధ్యం కాని పనులు చేశాం
- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి



భూమన అభినయ్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న జీవకోన ప్రజలు

తిరుపతి మంగళం : రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత అర్హులైన పేదలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.3.40 లక్షల కోట్లు లబ్ధి చేకూర్చారని డిప్యూటీ మేయర్, వైఎస్సార్ సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం తిరుపతి జీవకోన వాసులతో ఆత్మీయ సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. జగనన్న ఆశయాలకు అనుగుణంగా తిరుపతిలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. తిరుపతి నగర శివారు ప్రాంతమైన జీవకోనలో పలు పనులు చేపట్టినట్టు వివరించారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణ సమయంలో అనేక ఒడిదుడుకులు ఎదురైనా, ఎన్నికల సమయంలో ఓట్లు పడవని పలువురు హెచ్చరించినా అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగామన్నారు. 22 మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణంతో తిరుపతి నగరంలోని రహదారులు స్వర్గధామంగా మారాయని, ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీరాయని వివరించారు. 22ఏను రద్దు చేయించి 8 వేల కుటుంబాల్లో వెలుగులు నింపామన్నారు. జగనన్న సహకారంతో 26 వేల మంది పేదలకు సొంతింటి కల నెరవేర్చామన్నారు. 20 ఏళ్లలో ఎవరికీ సాధ్యం కాని పనులు చేసి చూపించామని గుర్తు చేశారు. దీంతో తిరుపతి నగరం రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిని గెలిపిస్తే తిరుపతిని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. జగనన్నకు ఓట్లు వేసి తిరిగి గెలిపించుకుంటే రాష్ట్రంలో సంక్షేమం మరింత విరాజిల్లుతుందన్నారు.

శివయ్య బ్రహ్మోత్సవాలకు భూమనకు ఆహ్వానం



తిరుపతి మంగళం : మహా శివరాత్రి సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో మార్చి 3 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని ఆహ్వానించారు. ఆలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, అధికారులు, అర్చకులు సోమవారం పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యేను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

స్పందన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం



స్పందన ఫిర్యాదులపై సమీక్షిస్తున్న అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి

తిరుపతి తుడా: తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాలకు ప్రజల నుంచి 28 ఫిర్యాదులు అందాయి. అదనపు కమిషనర్ చరణ్ తేజ రెడ్డి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. ఫిర్యాదులను పరిశీలించి సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్‌ఈ మోహన్, హెల్త్ ఆఫీసర్ అన్వేష్ రెడ్డి, రెవెన్యూ అధికారి సేతుమాధవ్, మున్సిపల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర రెడ్డి, ప్లానింగ్ అధికారులు శ్రీనివాసులురెడ్డి, బాలసుబ్రమణ్యం, డీఈలు విజయకుమార్ రెడ్డి, సంజీవ్ కుమార్, మహేష్, సుబ్బరాయుడు, మేనేజర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

జనసేన నేతలు టీడీపీ జెండాలు మోసే కూలీలు



మాట్లాడుతున్న పసుపులేటి సురేష్

తిరుపతి కల్చరల్: ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసే దమ్ము లేక ప్యాకేజీ కోసం చంద్రబాబుతో జతకట్టి టీడీపీ జెండాలు మోస్తున్న కూలీలు జనసేన నేతలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం నేత పసుపులేటి సురేష్ విమర్శించారు. ఆయన సోమ వారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. నిబద్ధతతో ప్రజా సంక్షేమం కోసం, తిరుపతి నగ ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్న డిప్యూటీ మేయ ర్ భూమన అభినయరెడ్డిపై ఆరోపణలు చేసే అర్హత జనసేన నేత కిరణ్ రాయల్‌కు లేదన్నారు. ఆయనకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక జనసేన నేత కిరణ్‌రాయల్ అనుచిత, నిరాధార విమర్శలు చేయడం సిగ్గుమాలిన చర్యన్నారు. కాపులను దగా చేసిన జనసేన నేతలు ఓట్లు అడిగే దమ్ము లేక అభినయరెడ్డిపై దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఏమి చేస్తారో చెప్పకుండా భూమన కుటుంబంపై విమర్శలతో పబ్బం గడపాలని చూస్తే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం నేతలు ఆనంద్, అక్కులు, కిరణ్, అనిల్‌రెడ్డి, చిరంజీవి పాల్గొన్నారు.

రూ.3,141 కోట్లతో రైల్వేలో అభివృద్ధి పనులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రైల్వే అధికారులు, నాయకులు

తిరుపతి(అలిపిరి): దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఉన్న రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.41 వేల కోట్లతో అభివృద్ధి చేస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మునిసుబ్రమణ్యం తెలిపారు. ఆయన సోమవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వీడియో లింక్‌తో తిరుపతిలోని వ్యవసాయ విశ్వవిద్యాలయం సమీపంలోని ఎల్‌సీ 100 గేటు వద్ద రూ.5 కోట్లతో రైల్వే అండర్ బ్రిడ్జి పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రూ.3,141 కోట్లతో రాష్ట్రంలో 72 రైల్వే స్టేషన్లలో ఆధునికీకరణ పనులు చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులకు వికసిత్ భారత్, వికసిత్ రైల్వేస్‌పై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల భరతనాట్యం, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భానుప్రకాష్, అజయ్‌కుమార్, నరేంద్రరెడ్డి, సామంచి శ్రీనివాసులు, అగ్రికల్చర్ యూనివర్సిటీ అసోసియేట్ డీన్ జి.ప్రభాకర్‌రెడ్డి, డివిజనల్ రైల్వే అధికారి రాధాకృష్ణ, ఏడీఈ శేషు, పేరూరు సర్పంచ్ కేశవులు పాల్గొన్నారు.

స్విమ్స్‌ను అత్యున్నతంగా తీర్చిదిద్దుతాం



సీడీలను ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన, ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీష, స్విమ్స్ డైరెక్టర్ ఆర్‌వీ.కుమార్

- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి
- స్విమ్స్ వైద్యుల సేవలు అభినందనీయం
- వైద్య విద్యార్థులు సమాజ సేవ చేయాలి
- ఘనంగా స్విమ్స్ వార్షికోత్సవం

తిరుపతి కల్చరల్: స్విమ్స్‌ను దేశంలోనే అత్యున్నత వైద్య సంస్థగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. స్విమ్స్ 31వ వార్షికోత్సవాన్ని సోమవారం సాయంత్రం మహతి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో టీటీడీ చైర్మన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ స్విమ్స్ వైద్యులు అందిస్తున్న వైద్య సేవలు అభినందనీయమన్నారు. ఒకే రోజు 3 రకాల కీలకమైన ట్రాన్స్‌ప్లాంటేషన్లు చేయడం దేశంలో ఎక్కడా జరగలేదని, ఈ ఘనత స్విమ్స్‌కే దక్కిందన్నారు. ఇదే స్ఫూర్తితో వైద్య విద్యార్థులు సమాజ హితం కోసం సేవలు చేయాలని పిలుపునిచ్చారు. వైద్యులకు సాంకేతిక సహకారం అందించడంతోపాటు స్విమ్స్ అభివృద్ధికి రూ.500 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. స్విమ్స్‌ను దేశంలోనే అత్యుత్తమ వైద్య విజ్ఞాన సంస్థగా అభివృద్ధి చేసే లక్ష్యంతోనే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తోడ్పాటుతో స్విమ్స్ నిర్వహణ బాధ్యతలను పూర్తిగా టీటీడీ తీసుకున్నట్టు చెప్పారు. స్విమ్స్ సంచాలకుడు డాక్టర్ ఆర్‌వీ.కుమార్ మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలలో స్విమ్స్ ఎంతో పురోగతి సాధించిందన్నారు. మూడు రకాల ట్రాన్స్‌ప్లాంటేషన్ నిర్వహించడం స్విమ్స్ ఘనతన్నారు. మరో రెండు నెలల్లో శ్రీ బయోను అందుబాటులోకి తెస్తామన్నారు. ఇందుకోసం ఐఐటీ, ఐసర్, ఐఈఎస్ఈఆర్ తిరుపతిలోని అన్ని యూనివర్సిటీలతో ఎంవోయూలు కుదుర్చుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆకాంక్ష సీడీ వార్షిక నివేదిక సీడీలను ఆవిష్కరించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ గురుమూర్తి, మేయర్ డాక్టర్ శిరీష, స్విమ్స్ రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ బిట్లా, స్విమ్స్ డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరిపీ ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధారాణి, డాక్టర్లు వనజాక్షమ్మ, మధుబాబు, పీవీజీకే.శర్మ, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

రాష్ట్రంలో వైద్యరంగం బలోపేతం



వసతి సముదాయాన్ని ప్రారంభిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన, ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీష

తిరుపతి తుడా: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి, నగర మేయర్ డాక్టర్ శిరీష లతో కలిసి ఎస్వీ మెడికల్ కళాశాలలో పీజీ వైద్య విద్యార్థుల కోసం రూ.16.75 కోట్లతో నిర్మించిన వసతి సముదాయాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు కార్పొరేటర్ వైద్యాన్ని అందించాలన్న గొప్ప సంకల్పాన్ని సీఎం భుజాన వేసుకున్నారని చెప్పారు. వైద్య రంగ చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా నియామకాలు చేపట్టారని వివరించారు. రుయాను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేయడం రాయలసీమ ప్రాంత వాసులకు వరంగా మారిందన్నారు. కార్యక్రమంలో ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సునీత, రుయా, ప్రసూతి ఆసుపత్రుల సూపరింటెండెంట్లు డాక్టర్ రవిప్రభు, డాక్టర్ పార్థసారథిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'రమణ దీక్షితుల తొలగింపును స్వాగతిస్తున్నాం'

తిరుపతి(అలిపిరి): రమణ దీక్షితులను తొలగించడాన్ని స్వాగతిస్తున్నట్టు టీటీడీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చీర్ల కిరణ్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ రమణ దీక్షితులు టీటీడీతోపాటు చైర్మన్ భూమన, ఈవో ధర్మారెడ్డి, ఉద్యోగులు, అర్చకులపై తీవ్ర ఆరోపణలు చేశారని తెలిపారు. ఆయన్ను ఉద్యోగం నుంచి తొలగించాలని టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున, ఉద్యోగ సంఘం తరపున డిమాండ్ చేసినట్టు పేర్కొన్నారు. ఆయనను తొలగిస్తూ టీటీడీ బోర్డులో తీర్మానం చేయడం మంచి నిర్ణయమని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

తిరుపతి అర్బన్ : సమస్యలు పరిష్కరించాలని ఉపాధి హామీ ఉద్యోగులు కోరారు. వారు సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన జేసీ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కంప్యూటర్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్, సాంకేతిక సహాయకుల సంఘం అధ్యక్షుడు చలపతి పాల్గొన్నారు.

లఘునాటక ప్రదర్శనలో ఎస్పీడబ్ల్యూ విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నారాయణమ్మ, అధ్యాపకులు

తిరుపతి సిటీ : అంతర్జాతీయ యూత్ ఫెస్టివల్‌లో భాగంగా గుంటూరు కేఎల్ యూనివర్సిటీలో ఈ నెల 23, 24వ తేదీల్లో నిర్వహించిన లఘునాటక ప్రదర్శనలో పద్మావతి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థినులు ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నారు. ప్రిన్సిపాల్ టి.నారాయణమ్మ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో మూఢనమ్మకాలు, పర్యావరణ పరిరక్షణ అనే అంశాలపై తమ విద్యార్థినులు అత్యంత ప్రతిభ చూపడం ఆనందంగా ఉందన్నారు. బహుమతులతో పాటు రూ.10 వేల నగదు బహుమతి అందుకున్నారని కొనియాడారు. ఆమె సోమవారం వారిని అభినందించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



విజయసాధన పుస్తకాలతో మబ్బు సూర్యనారాయణరెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని మబ్బు సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం తన ట్రస్టు ఆధ్వర్యంలో తిరుపతిలోని టీపీపీఎం, ఎస్పీజేఎన్ఎం పాఠశాలలో 146 మంది పదో తరగతి విద్యార్థులకు విజయ సాధన పుస్తకాలు వితరణ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులు, కొలువులకు పదో తరగతే కీలకమన్నారు. కార్యక్రమంలో తిరుపతి అర్బన్ ఎంఈవోలు బాలాజీ, భాస్కర్‌నాయక్, అపుస్మా రాయలసీమ జోన్ అధ్యక్షుడు ఎన్.విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

అవధాన కల్యాణం పుస్తకావిష్కరణ

తిరుపతి కల్చరల్: రచయిత అవధాని కల్యాణ చక్రవర్తి రాసిన అవధాన కల్యాణం పుస్తకాన్ని సోమవారం విశ్వశ్రీ సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో బైరాగిపట్టెడలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య దామోదరనాయుడు మాట్లాడుతూ తెలుగు పద్యం ఎల్లలు దాటి అనేక దేశాలకు వ్యాపించడం సంతోషం కలిగిస్తోందన్నారు. ఉపాధ్యాయుడు మాలేపట్టు పురుషోత్తమాచారి పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో శతావధాని ఆముదాల మురళి, సాహితీవేత్తలు సముద్రాల విజయానంద్, మన్నవ గంగాధరప్రసాద్, వేమూరి జయరాంప్రసాద్, పరమేశ్వరయ్య, ఆకుల మల్లేశ్వరరావు, ఏనుగుల అంకమనాయుడు, టింకాయలదామోదరం, కృష్ణస్వామిరాజు, సురేంద్రరొడ్డ, పేరూరు బాలసుబ్రమణ్యం, నెమిలేటి కిట్టన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

సిగ్నేచర్ ట్యూన్ పుస్తకం..

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ వేదికగా ఆల్ ఇండియా రేడియో మాజీ డైరెక్టర్ డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ రచించిన సిగ్నేచర్ ట్యూన్ పుస్తకాన్ని సోమవారం వీసీ భారతి ఆవిష్కరించారు. రచయిత మాట్లాడుతూ జర్నలిజంలో తన అనుభవాలతో పాటు వాస్తవాలను పుస్తకంలో పొందుపరిచినట్టు తెలిపారు. బ్రాడ్‌కాస్టింగ్‌కు సంబంధించిన మౌలిక విషయాలు, రేడియో మాధ్యమానికి అవసరమైన కీలక అంశాలను సవివరంగా తెలియజేసినట్టు వెల్లడించారు. రిజిస్ట్రార్ రజిని, ప్రొఫెసర్ విజయలక్ష్మీ పాల్గొన్నారు.

ఎస్వీసీఈలో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తిరుపతి సిటీ : స్థానిక కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ కళాశాలలో సోమవారం అలూమిని మీట్- 2024 పేరుతో పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో కళాశాలలో బీటెక్ పూర్తి చేసిన సుమారు పది బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు గొప్ప లక్ష్యాన్ని నిర్దేశించుకుని శ్రమిస్తే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని సూచించారు. ప్రిన్సిపాల్ ఎన్.సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

జగనన్న గోరుముద్దను మెనూ ప్రకారం అమలు చేయాలి



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంఈవో-2 లింగయ్య

పాకాల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని మెనూ ప్రకారం అమలు చేయాలని ఎంఈవో-2 లింగయ్య తెలిపారు. ఆయన సోమవారం పదిపుట్లబైలు ప్రాథమికోన్నత పాఠశాల, గుండ్లగుట్టపల్లి ఎంపీపీ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గోరుముద్ద మెనూను తెలిపే బోర్డును ఏర్పాటుచేయాలని సూచించారు. వంట గదిని శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. హెచ్‌ఎం ప్రమీలమ్మ, ఉపాధ్యాయులు వెంకటాచలం, సరితకుమారి, మోహన్, సీఆర్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం సభ్యులు

రామచంద్రాపురం: మండలంలోని నడవలూరు, నెన్నూరు, సీరామాపురం గ్రామాల్లో సోమవారం రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కళాజాత ప్రతినిధులు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. సీరామాపురం స్టేట్ బ్యాంక్ మేనేజర్ లలిత మాట్లాడుతూ మహిళలు బ్యాంకు రుణాలతో ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. కళాజాత బృందం సభ్యులు వినోద్, చిరంజీవి, విజయ్ గ్రామస్తులకు బ్యాంకు లావాదేవీలపై, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, జీరో అకౌంట్, నగదు రహిత లావాదేవీలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. బ్యాంకు సిబ్బంది కిషోర్ బాబు, వరప్రసాద్‌రెడ్డి, నారాయణస్వామి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం పంపిణీ



కొబ్బరి నూనె, సబ్బులు, దుస్తులు, పాదరక్షలు అందజేస్తున్న సర్పంచ్ ఎస్.కస్తూరి

పాకాల : మండలంలోని మేజర్ పంచాయతీ పాకాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు సోమవారం సర్పంచ్ ఎస్.కస్తూరి యూనిఫాం పంపిణీ చేశారు. అలాగే కొబ్బరి నూనె, సబ్బులు, రెండు జతల చెప్పులు, రెండు జతల యూనిఫాం సరఫరా చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఏటా పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం, పాదరక్షలు ఇస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది 37 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఈవో మోతి పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు

భాకరాపేట: భాకరాపేటలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే తనపై విమర్శలు చేస్తున్నారని సర్పంచ్ సాకిరి భూపాల్ మండిపడ్డారు. ఆయన సోమవారం పంచాయతీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 2011లో భాకరాపేట మోడల్ కాలనీ ప్రాంతం సర్వే నంబరు 329, 349లో అప్పటి ప్రభుత్వం హయాంలో ఇంటి స్థలాలను ఎవరు అమ్ముకున్నారో ప్రజలకు బాగా తెలుసన్నారు. ఇళ్ల స్థలాలు ఇప్పించాలని పేదలు అడిగారని, దరఖాస్తు చేసుకుంటే అధికారులతో మాట్లాడి అర్హులకు పట్టాలు మంజూరు చేయిస్తామని చెప్పినట్టు తెలిపారు. పచ్చ మీడియాలో తనపై తప్పుడు కథనాలు రాసినట్టు వాపోయారు. వాటిపై కోర్టును ఆశ్రయిస్తానన్నారు. భాకరాపేట వాసులు స్థలాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే అర్హతను బట్టి పట్టా అందజేస్తారని తెలిపారు.

గడప గడపలోనూ ఆత్మీయ పలకరింపు

- అభివృద్ధిని చూసి వైఎస్సార్ సీపీని ఆదరించండి
- రూ.12 కోట్లతో మల్లంగుంటలో అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి



గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

తిరుపతి రూరల్ : నాలుగున్నరేళ్లలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తించి వైఎస్సార్‌సీపీని ఆదరించాలని చెవిరెడ్డి లక్ష్మి కోరారు. ఆమె సోమవారం తిరుపతి రూరల్ మండలం మల్లంగుంట పంచాయతీలో గడప గడపకూ ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. ఆమెకు స్థానికులు ప్రతి గడపలోనూ ఆత్మీయంగా పలుకరించి స్వాగతం పలికారు. ఆమె ప్రతి ఇంటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ ఫలాలు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సేవా కార్యక్రమాలను వివరించారు. నియోజకవర్గంలో రూ.వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. తుమ్మలగుంటతో పాటు మల్లంగుంటను సైతం సొంత గ్రామంగా భావించి దాదాపు రూ.12 కోట్ల నిధులతో పంచాయతీని అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే చెవిరెడ్డికి దక్కుతుందన్నారు. కరోనా సమయంలో ప్రజలను తన కుటుంబ సభ్యులుగా భావించి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్టు గుర్తు చేశారు. రానున్న రోజుల్లోనూ అభివృద్ధిని కొనసాగించేందుకు వైఎస్సార్ సీపీని ఆదరించి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఉపేంద్రరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మల్లంగుంట పంచాయతీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటిస్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి



మల్లయ్యపల్లిలో పెళ్లి కానుక అందజేస్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

చంద్రగిరి: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారని, ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించారని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు హర్షిత్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డితో కలిసి దోర్నకంబాల పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయనకు గ్రామస్తులు సాదర స్వాగతం పలికారు. చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ప్రతి ఇంటికీ వెళ్లి వారు పొందిన ప్రభుత్వ పథకాలు, లబ్ధిని తెలియజేశారు. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగనన్న, చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. కరోనా సమయంలో నియోజకవర్గ ప్రజలే తన కుటుంబంగా భావించి ఆదుకున్నారని వివరించారు. ప్రతి ఇంటికీ ఆనందయ్య మందు, మాస్కులు, శానిటైజర్లు, కూరగాయలు, సి విటమిన్ టాబ్లెట్లు, నిత్యావసర వస్తువులు అందజేశారని తెలిపారు. చెవిరెడ్డి కుటుంబం ప్రజలకు చేసిన సేవలను గుర్తించి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిని ఆదరించి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

రూ.10 కోట్లతో దోర్నకంబాలలో అభివృద్ధి పనులు

దోర్నకంబాల పంచాయతీలో రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి వెల్లడించారు. సీసీ రోడ్లు, మురుగు కాలవలు, జగనన్న ఇళ్ల నిర్మాణం, సచివాలయ భవనం, హెల్త్ సెంటర్, రైతు భరోసా కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం రూ.50 లక్షలతో చంద్రగిరి - దోర్నకంబాల రహదారి మరమ్మతులు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్ సీపీని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ యుగంధర్ రెడ్డి, సర్పంచ్ గౌతమి, ఉప సర్పంచ్ మురళి రెడ్డి, డివిజన్ పార్టీ అధ్యక్షుడు పసల నాగరాజు, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీపీ కుసుమ కుమారి, స్థానిక నాయకులు సోను, రవీంద్రనాథ్ రెడ్డి, కేపీ ప్రసాద్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, నాదముని యాదవ్, సుబ్రమణ్యం రెడ్డి, జానకిరామిరెడ్డి, ప్రతాప్ రెడ్డి, సూరి, మదన్ మోహన్ రెడ్డి, వెంకటయ్య, గంగులయ్య, నాగభూషణం, నకులయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ

మండలంలోని దోర్నకంబాల పంచాయతీ మల్లయ్యపల్లికి చెందిన రచన, తారకరామలకు వివాహం నిశ్చయమైంది. వారికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి బంగారు తాళిబొట్టు, వెండి మెట్టెలు, బాచికం, మహలార్తుపు పట్టు వస్త్రాలు, శ్రీవారి లడ్డూ ప్రసాదం, అమ్మవారి పసుపు-కుంకుమతో కూడిన పెళ్లి కానుక పంపించారు. వాటిని సోమవారం చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పసల నాగరాజుతో కలిసి వధూవరుల కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రతాప్ రెడ్డి, సూరి, మురళి రెడ్డి, గౌతమి, కుసుమ కుమారి పాల్గొన్నారు.

ఘనంగా మహాకుంభాభిషేకం



కుంభాభిషేకానికి లక్ష రూపాయలు విరాళం అందజేస్తున్న హర్షిత్‌రెడ్డి

- రూ.లక్ష విరాళమిచ్చిన చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

పాకాల : మండలంలోని పెద్దరామాపురం పంచాయతీ యనమలవారిపల్లిలో ఉన్న మాతమ్మ ఆలయ మహాకుంభాభిషేకాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయనకు స్థానికులు ఘన స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా హర్షిత్‌రెడ్డి కుంభాభిషేక మహోత్సవానికి రూ.లక్ష విరాళం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు ఐకమత్యంగా ఉండి ఆలయ కుంభాభిషేకం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు మునీశ్వర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షులు హరిప్రసాద్‌రెడ్డి, నంగా కపిలేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, సర్పంచ్ బాబురెడ్డి, నాయకులు జయచంద్రారెడ్డి, వేణురెడ్డి, రాయలసీమ మోహన్, హరీష్, జయదేవ, శీను, చరణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పాకాల: స్థానిక రైల్వే కల్యాణ మండపం సమీపంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి హత్యకు గురయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్-2 ఇషాఖ్‌బాషా, రైల్వే పోలీసులు సోమవారం అక్కడికి వెళ్లి పరిశీలించారు. దుండగులు తలపై బండరాయితో మోది హత్య చేసినట్టు తెలిపారు. మృతుడి వయస్సు 30 ఏళ్లు ఉంటాయని, అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ప్రతి గడపలోనూ సంక్షేమం



గ్రామస్తులకు సంక్షేమ పథకాల జాబితాను అందజేస్తున్న చెవిరెడ్డి ధ్యానేష్ రెడ్డి

రామచంద్రాపురం: కులం, మతం బేధం లేకుండా ప్రతి గడపకూ సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగనన్నకు దక్కుతుందని తుడా చైర్మన్, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సోదరుడు చెవిరెడ్డి ధ్యానేష్ రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం మోటావారికండ్రిగ, పరమాల హరిజనవాడ, పరమాల, మిట్టకండ్రిగ గ్రామాల్లో పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల జాబితాను అందజేశారు. చేసిన మేలును గుర్తించి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఆయనకు ప్రతి గడపలోనూ మహిళలు మంగళహారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఢిల్లీరాణి, తిరుపతి జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ రఘునాథరెడ్డి, ఎంపీటీసీలు రాజేష్, మునీంద్ర యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణవేణమ్మ, డివిజన్ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, చిట్టిబాబు నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్‌రెడ్డి, చంద్రబాబు, శేషాద్రిరెడ్డి, యశ్వంత్, మురళి, భాస్కర్ రాయల్, సెంథిల్ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ఓటు వేయండి



ఎర్రావారిపాలెంలో పల్లెబాటలో పాల్గొన్న చెవిరెడ్డి మంజుల

భాకరాపేట : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని చూసి వైఎస్సార్ సీపీని ఆదరించి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని చెవిరెడ్డి మంజుల కోరారు. ఆమె సోమవారం ఎర్రావారిపాలెంలో పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. ఆమె ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఆమె ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపించిన కానుకలు అందాయా లేదా అని ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబమూ ఆర్థిక పరిపుష్టిని సాధించిందన్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పంచాయతీల్లో సిమెంట్ రోడ్లు, బల్లలు, జగనన్న సమావేశ మందిరాలు, యోగా ధ్యాన మందిరాలు, ఆర్వో వాటర్ ప్లాంట్లు, కర్మక్రియల భవనాలు నిర్మించినట్టు తెలిపారు. మన ఊరు, మన మండలం, నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నా, సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా జగనన్న మరోసారి ముఖ్యమంత్రి కావాలని సూచించారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థిని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఊటుకూరు రెడ్డెమ్మ, జెడ్పీటీసీ కరుణాకర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చెంగల్‌రెడ్డి, సర్పంచ్ ఎల్లమ్మ, వైస్ ఎంపీపీ నాగేశ్వర్, ఉప సర్పంచ్ హేమంత్‌కిశోర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ కృష్ణమూర్తి, బాలాజీ, రాణినాగలేష్, గంగిరెడ్డి, చెంగల్‌రెడ్డి, బాలకృష్ణ, రెడ్డెప్ప, పరంధామ, గుణరెడ్డి, ఆనంద, రాజు, వీరనాగేంద్ర, మహేష్, రెడ్డిమోహన్, కొండ్రెడ్డి, రాము వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సును ఢీకొన్న ఆటో

- ముగ్గురికి తీవ్ర గాయాలు



దెబ్బతిన్న ఆటో, అపస్మారక స్థితిలో ఉన్న డ్రైవర్

చంద్రగిరి: పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి ఐతేపల్లి సమీపంలో సోమవారం ఆగి ఉన్న ప్రైవేటు స్కూల్ బస్సును షేర్ ఆటో ఢీకొంది. దీంతో ముగ్గురు గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు.. షేర్ ఆటో ప్రయాణికులతో తిరుపతి నుంచి చిత్తూరు వైపు వెళుతోంది. ఐతేపల్లి వద్ద ఆగి ఉన్న స్కూల్ బస్సును ఢీకొంది. దీంతో ఆటో ముందు అద్దాలు పగిలిపోయి, ఆటో తీవ్రంగా దెబ్బతింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవరుతో పాటు మరో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులు చిత్తూరు జిల్లా యాదమరి మండలానికి చెందిన వారిగా స్థానికులు తెలిపారు. దీనిపై పోలీసులను సమాచారం కోరగా ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

పోలీసు స్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు



ఇంటర్ ప్రశ్నపత్రాలను భద్రపరుస్తున్న కళాశాలల సిబ్బంది

చంద్రగిరి : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలు సోమవారం చంద్రగిరి పోలీసు స్టేషన్‌కు చేరాయి. ప్రభుత్వ బాలుర, బాలికల కళాశాలల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది మొదటి సెట్ ప్రశ్నపత్రాలను వేర్వేరు ట్రంక్ పెట్టెల్లో భద్రపరిచి తాళాలు వేసి సీల్ వేశారు. ప్రిన్సిపాల్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, 2 నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు జంబ్లింగ్ పద్ధతిలో నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అందుకు తగ్గ ఏర్పాట్లను కూడా పూర్తి చేసినట్లు వివరించారు.

అమృత్ భారత్‌లో పాకాల రైల్వే స్టేషన్ ఎంపిక

పాకాల : స్థానిక రైల్వేస్టేషన్ అమృత్ భారత్ కార్యక్రమం కింద ఎంపికైందని అధికారులు తెలిపారు. రైల్వే స్టేషన్‌లో సోమవారం అమృత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ సుమారు రూ.7.27 కోట్లతో రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఎన్ఆర్.జయదేవ్‌నాయుడు, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, సర్పంచ్ ఎస్.కస్తూరి, చంద్రగిరి బీజేపీ కన్వీనర్ పురుషోత్తంనాయుడు, రైల్వే ఏడీఎస్టీ సురేష్, డీఎంవో రామ్మోహన్, ఇంజినీర్లు సిద్ధారెడ్డి, శ్రీనివాసులు, స్టేషన్ మాస్టర్ వెంకటముని పాల్గొన్నారు.